క్లుప్తంగా

వైభవంగా చింతామణి సంబరం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం చల్లదనం ఉత్సవాలు, మొక్కుబడుల సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను, కాళికా వేషధారణలతో మేళతాళాలతో ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ, వివిధ రకాల వీధినాటకాలతో సంబరం ఊరేగింపు యాత్ర శోభాయమానంగా జరిగింది. గ్రామశివార్లలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

శిరీషాకు బీజేపీ నాయకుల అభినందన



శిరీషాను అభినందిస్తున్న బాలకృష్ణ తదితరులు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శిరీషాను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలక్రిష్ణ, మందస మాజీ ఎంపీపీ దాసరి తాతారావులు ఆదివారం తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పలాస అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపీ, బీజేపీ అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వేషధారణలు



అలరిస్తున్న చిన్నారుల వేషధారణలు

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామంలో గ్రామదేవత సంబరాలు సందడిగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చిన్నారులు, పెద్దలు వివిధ రకాల వేషధారణలతో వీధులలో పర్యటిస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

మృతుని కుటుంబానికి పరామర్శ



పరామర్శలో నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం బేతాళపురం గ్రామానికి చెందిన కోడ శోభమ్మ ఇటీవల మరణించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం ఆదివారం పరామర్శించారు. శోభమ్మ భాస్కరరావుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా మద్వేంకటనాయక స్వామి మహోత్సవం



స్వామివారి తిరువీధిలో భక్తజనం

గార: మండల కేంద్రం గారలోని మద్వేంకటనాయక స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వక్సేన ఆరాధనతో ప్రారంభమైన కార్యక్రమం 108 లీటర్ల ఆవుపాలతో స్వామివారికి అభిషేకం, అనంతరం నిజరూప దర్శనం, హోమాలు, శ్రీవారి అలంకరణ మహోత్సవం, అన్నసమారాధన జరిగింది. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను గార పురవీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు వెంటరాగా తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. మేళతాళాలు, భజనలు, గోవింద నామ స్మరణతో గ్రామమంతటా ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు జాడ సునిల్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కింతలి కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• క్షీరాభిషేకం



ఎర్రన్నాయుడు విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

టెక్కలి మండలం భగవాన్‌పురం గ్రామంలో కేంద్రమాజీ మంత్రి.. స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి టీడీపీ కార్యకర్తలు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తూ టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి, పంచాయతీ నాయకుడు పి.రాజారావు ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాలలు వేశారు.

– టెక్కలి

• ఆత్మీయ సమ్మేళనం

కోటబొమ్మాళి మండలం కురుదు హైస్కూల్‌లో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. వేర్వేరు వృత్తుల్లో స్థిరపడినవారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని తీర్మానించారు. చదువు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్‌వి ప్రతాప్, రొక్కం రమేష్, వెలమల రాము, గేదెల శ్రీను పాల్గొన్నారు.

– కోటబొమ్మాళి



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

• పొంచిఉన్న ప్రమాదం



టెక్కలి పాత జాతీయ రహదారిలో రోడ్డుకు అడ్డంగా బైఠాయించిన పశువులు

టెక్కలి మేజరు పంచాయతీలో ప్రధాన రహదారులపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రోడ్డు మధ్యలో గుంపులుగా ఉంటుండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో భారీ వాహనాలు ఢీ కొడుతుండడంతో పశువులు తీవ్రంగా గాయపడి మృత్యువాత పడుతున్నాయి. పాత జాతీయ రహదారితో పాటు ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు నిత్యం పశువులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– టెక్కలి

సేవ చేసినా ఓటమి బాధించింది

- ఇచ్ఛాపురం నియోజకవర్గ విస్తృతస్థాయి సమీక్షలో పిరియా విజయ
- కార్యకర్తలకు అండగా ఉంటాం: వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ తదితరులు



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కవిటి: ''కరోనా వంటి కష్టకాలంలో అంబులెన్సులు నడిపి పేదవారికి అండగా నిలిచాను. నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరి కాళ్లు పట్టుకుని తమ అమూల్యమైన ఓటు తనకు వేయమని వేడుకున్నాను. మురుగు కాలువ పక్కన పడుకున్నాను. మండుటెండలో ప్రజల కోసం తిరిగాను. అయినా ప్రజల మనస్సు గెలువలేనంత నష్టం వారికి నేనేం కలిగించాను. నన్ను ఎందుకు ఇంతగా బాధించేలా ఓటమికట్టబెట్టారు'' అని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆవేదన వ్యక్తం చేశారు. కవిటిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అధ్యక్షతన ఎన్నికల ఫలితాలపై ఆదివారం నిర్వహించిన సమీక్షలో ఆమె గద్గదస్వరంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన ఈ ఓటమి ఎన్నో గుణపాఠాల్ని నేర్పిందని వ్యాఖ్యానించారు. ఇకపై మరోసారి మోసపోవడం తమకు ఎంతమాత్రం ఇష్టం లేదన్నారు. ఇకపై పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగానే కొనసాగుతానని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన కుటుంబ సభ్యులు, కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటామన్నారు. తన ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని అన్నారు. అన్నివర్గాలవారికీ సంక్షేమం అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఏ కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా మనమంతా సంఘటితంగా కలిసి వెళ్లి అండగా ఉందామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, నిమ్మన దాస్, బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యులు ఇప్పిలి లోలాక్షి, తడక జోగారావు, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాబూరావు, నర్తు నరేంద్రయాదవ్, చాట్ల తులసీదాస్, పి.నేతాజీ, వజ్జ మృత్యుంజయరావు, పీఎం తిలక్, బి.జయప్రకాష్, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు ఉన్నారు.

రామ్మోహన్‌నాయుడు ప్రమాణ స్వీకారాన్ని తిలకించిన టీడీపీ శ్రేణులు



ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

టెక్కలి రూరల్: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కేంద్ర కేబినెట్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించేందుకు టెక్కలిలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద టీడీపీ శ్రేణులు భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్రమంత్రిగా అవకాశం వచ్చింది. దీంతో ఆయన ప్రమాణ స్వీకార ప్రత్యేక ప్రచారాన్ని స్థానికులు, టీడీపీ శ్రేణులు ఈ స్క్రీన్‌పై వీక్షించారు. టెక్కలి మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరి, పట్టణ అధ్యక్షుడు కె.లవకుమార్, నాయకులు చాపర గణపతి, హెచ్.రామకృష్ణ, పురుషోత్తం, కాళీ, ప్రీతీష్‌చంద్ పాల్గొన్నారు.

12న పెంటపోలమ్మ అమ్మవారి వార్షికోత్సవం

కాశీబుగ్గ: కాశీబుగ్గ పెంట వీధిలో వెలసిఉన్న గ్రామదేవత పెంటపోలమ్మ అమ్మవారి పంచమ వార్షికోత్సవాన్ని ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పెంట సంజిత్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం ఐదు నుంచి రాత్రి ఏడు గంటల వరకు అభిషేక కార్యక్రమాలు, ఎనిమిది నుంచి 11 గంటల వరకు అమ్మవారి అలంకరణ, దర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పూజల్లో పాల్గొనాలని కోరారు.

నేడు బొడ్డపాడులో రాజ్య హింస వ్యతిరేక సదస్సు

పలాస: పలాస మండలం బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం ఉదయం పది గంటలకు 'కమ్యూనిజంపై దుష్ప్రచారం–రాజ్య హింసకు వ్యతిరేక సదస్సు' అనే అంశంపై వివిధ విప్లవ సంస్థల ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలక్రిష్ణ, పీవోడబ్ల్యూ నాయకురాలు పోతనపల్లి కుసుమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: వంజంగిలో గల ముకుంద తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అఖండ దీపారాధన నిర్వహిస్తామన్నారు.

భయపెడుతున్న గ్రామసింహాలు!



కిడిసింగి వద్ద సంచరిస్తున్న కుక్కలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన తీర ప్రాంత గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. బెండి, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, బాతుపురం, నగరంపల్లి, బైపల్లి తదితర గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ చాలామందిపై దాడులు చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని జనం భయపడుతున్నారు. అధికారులు మేల్కొని కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గాయత్రి మాతకు పూజలు



గాయత్రీ మాత వద్ద జపం చేస్తున్న అర్చకులు



లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నాగావళి కొత్తబ్రిడ్జి ఒడ్డున ఉన్న చిం దత్తనాథ క్షేత్రంలో ఆదివారం గాయత్రీ మాతకు అభిషేకాలు అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు సింహాచలం శర్మ ఆధ్వర్యంలో అనఘా సమేత దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకాలు జరిగాయి. అనంతరం జయలక్ష్మీ మాతృమండలి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక లలితాసహస్ర నామ పారాయణ, గాయత్రీ జపం, గాయత్రీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బాలసంస్కార్ తరగతులు



సామూహికంగా పాద పూజ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో నెలరోజులుగా వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన బాలసంస్కార్ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమం సామూహికంగా నిర్వహించారు. హిందూ ధర్మం కోసం వివరణ, భగవద్గీత వల్లించడం, పెద్దలతో మాట్లాడడం, నడచుకునే విధానంపై అంశాలను బోధించారు.

జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతుల హక్కుల సాధన కమిటీ సభ్యులు కోరారు. మందస మండలం హరిపురం గ్రామంలోని మార్పు పద్మనాభం గ్రంథాలయం వద్ద జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాను 16 వేల రూపాయలకు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయాలని, జీడికి పంటల బీమా అమలు చేయాలని కోరారు. సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు, ప్రతినిధులు అడ్డి మాస్టారు, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోధన, బెస్త కామేశ్వరరావు, ముకుందరావు, సోమనాథం, మోహనరావు, సింహాద్రి, ధర్మారావు, వీరాస్వామి, పులారి దుర్యోధన, పొందర దుదిష్టి, కొర్ల హేమారావు చౌదరి ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రాపాకపుట్టుగ



కవిటి: గొండ్యాలపుట్టుగలో ట్రోఫీలతో విన్నర్,రన్నర్‌జట్ల సభ్యులు

కవిటి: మండలంలోని గొండ్యాలపుట్టుగలో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీ ఫైనల్ పోరులో కె.కొత్తూరు జట్టుపై రాపాకపుట్టుగ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక భూలోకమాత కమిటీ ఆధ్వర్యంలో గత నెల 16 నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు జరిగిన టోర్నమెంట్‌లో 46 జట్లు పాల్గొన్నాయి. వీటిలో రాపాకపుట్టుగ, కె.కొత్తూరు జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో రాపాకపుట్టుగ విన్నర్‌గా, కె.త్తూరు రన్నర్‌గా నిలిచి ట్రోఫీలను అందుకున్నాయి. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైయన సంఘం అధ్యక్షుడు భాస్కరరావు, సభ్యులు జానకీరావు, దుర్యోధన,జయరాం, రమణమూర్తి పాల్గొన్నారు.

రామోజీరావుకు మిరాజ్ చిత్ర యూనిట్ నివాళి



రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఈనాడు గ్రూపు సంస్థల యజమాని రామోజీరావు మృతికి మన ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ సంతాపం తెలియజేశారు. మిరాజ్ చిత్ర యూనిట్ సభ్యులు మండలంలోని అక్కుపల్లి గ్రామంలో రామోజీ చిత్ర పటానికి ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. పత్రిక, సినీ రంగానికి రామోజీరావు చేసిన సేవలను గుర్తు చేశారు. అలాగే మిరాజ్ సినిమా షూటింగ్‌ను ఆదివారం వాయిదా వేసి సంతాప దినం ప్రకటించారు. కార్యక్రమంలో సినిమా దర్శకుడు విష్ణుదేవ్, చిత్ర యూనిట్ సభ్యులు బి.ఖలీల్, శరత్, రమేష్ యాదవ్, చరణ్, కీర్తన, ఆర్.శృతి, టి.ప్రదీప్ ఉన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

నరసన్నపేట: మండల పరిధిలో లయన్స్ క్లబ్ సేవలు మరింతగా విస్తృత పరుస్తామని క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. నరసన్నపేటలో ఆదివారం క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాశ్వత స్థాయిలో క్లబ్ సేవలు విస్తృత పరుస్తామని హామీ నిచ్చారు. ఇప్పటికే చేపట్టిన సేవా కార్యక్రమాల నివేదికను కార్యదర్శి నాగరాజు అందించారు. రానున్న సంవత్సరానికి అధ్యక్షుడిగా రమణసాహు, కార్యదర్శిగా కె.సాయిరాంను ఎన్నుకున్నట్లు కృష్ణ తెలిపారు. కొత్త కార్యవర్గం జూలై నుంచి బాధ్యతలు స్వీకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బోయిన బాలకృష్ణ, ఊణ్న రంగనాథ్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

గార: శ్రీకూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూరం నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానంలో 300 భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు రెండు క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.